క్రీడా మైదానాలు... సమస్యల నిలయాలు

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- 5 పాఠశాలలకే మైదానాలు
- 11 పాఠశాలలకు ఆట స్థలాలు లేవు



తుప్పలతో దర్శన మిస్తున్న తిమ్మాపురం కేజీబీవీ, ఉన్నత పాఠశాల మైదానం

ఎస్.రాయవరం: పాఠశాలలకు క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఎంతోమందిలో దాగివున్న ప్రతిభ వెలుగులోకి రావడం లేదు. మండలంలో ఐదు పాఠశాలలకే మైదానాలు ఉన్నాయి. అవి కూడా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మిగిలిన 11 పాఠశాలలకు ఆట స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో 16 ఉన్నత పాఠశాలలకుగాను అయిదు పాఠశాలకు మాత్రమే మైదానాలు ఉన్నాయి. అవి కూడా అభివృద్ధి చేయక పిచ్చితుప్పలు, చెత్తాచెదారాలతో దర్శనమిస్తున్నాయి. కొరుప్రోలు, దార్లపూడి, పి.ధర్మవరం, ఎస్.రాయవరం, చినగుమ్ములూరు పాఠశాలలకు క్రీడా మైదానాలు ఉన్నాయి. గుడివాడ, పెదఉప్పలం, రేవుపోలవరం, ఉప్పరాపల్లి, సైతారుపేట, లింగరాజుపాలెం, పెదగుమ్ములూరు, వమ్మవరం, ఎస్.రాయవరం బాలికలు పాఠశాలలకు అసలు మైదానాలే లేవు. ఈ పాఠశాలలకు పీఈటీలు, పీడీలు మాత్రం ఉన్నారు. ఏడాది పొడవునా విద్యార్థులకు క్రీడా శిక్షణ ఇవ్వాలంటే సమీప పొలాలు, పాఠశాలకు ఆనుకున్న ఖాళీ ప్రదేశాలను వినియోగించాల్సి వస్తోంది. దీంతో అనుకున్న స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందేందుకు వీలు కుదరడం లేదు. ప్రభుత్వాలు మాత్రం క్రీడలు కూడా విద్యలో భాగమేనని చెబుతున్నప్పటికి పాఠశాలలో అమలుకు నోచుకోవడంలేదు. మండలంలో 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మూడు వేలకుపైగా విద్యార్థులు ఉన్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం స్కూల్ ఫెడరేషన్ తరపున క్రీడలు నిర్వహిస్తున్నా, అతి తక్కువ మంది విద్యార్థులు మాత్రమే ఎంపికవుతున్నారు.



అధ్వానంగా కొరుప్రోలు మైదానం

మైదానం బాగు చేస్తాం



పాఠశాలకు ప్రమోషన్‌పై వచ్చాను. ఇక్కడ క్రీడా మైదానం పిచ్చితుప్పలతో పేరుకుపోయింది. నెల రోజులు క్రితం జేసీబీతో పనులు చేయించాం. వర్షాలు వల్ల మళ్లీ పెరిగిపోయాయి. గడ్డి కటింగ్ మిషన్‌తో చేయించాలి. ప్రస్తుతం మండల స్థాయి క్రీడలు జరిగాయి. నిధులు పెద్ద ఎత్తున ఖర్చయ్యాయి. ప్రధానోపాధ్యాయులు ప్రస్తుతానికి పెట్టుకున్నారు. రెండు మూడు రోజుల్లో మైదానం శుభ్రం చేయిస్తాం.

కె.అమ్మెరియా, పీడీ, కొరుప్రోలు, ఉన్నత పాఠశాల

నిరుపయోగంగా క్రీడా మైదానం



మా పాఠశాల క్రీడా మైదానం ఆడుకునేందుకు ఉపయోగంగా లేదు. ఎత్తుపల్లాలు, పిచ్చితుప్పలు పేరుకుపోయాయి. గ్రామస్తులు చెత్తాచెదారాలు వేస్తున్నారు. పీఈటీ ఉన్నా క్రీడలు నేర్పేందుకు వీలు కుదరడం లేదు. ఒక్క క్రీడకూ కోర్టు లేదు. తాత్కాలిక అంచనాతో కోర్టు వేసి తక్కువ సమయం ఆడిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడంలేదు.

– ఎం.రమణి, 7 వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ, తిమ్మాపురం

క్లుప్తంగా

ఘనంగా సత్యసాయి బాబా పల్లకీ ఊరేగింపు



సత్యసాయి బాబా పల్లకి ఊరేగింపులో భక్తులు

మునగపాక: మండల కేంద్రంలో సత్యసాయి బాబా పల్లకి ఊరేగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి జోన్–2 గాంధీ నగరానికి చెందిన సత్యసాయి బాబా భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా జన్మదిన వేడుకల్లో భాగంగా 91వ గ్రామంగా మునగపాకను ఎంపిక చేసి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు స్థానిక సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమై రామాలయం వరకు సాగింది. సాయి నామస్మరణతో మునగపాక మార్మోగింది. సత్యసాయి భజన మండలి ప్రతినిధి ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంతో పేదలకు వైద్య విద్య దూరం

కట్టుపాలెంలో వైఎస్సార్‌సీపీ సంతకాల సేకరణ



కట్టుపాలెంలో సంతకాల సేకరణ చేపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: వైద్య విద్యను కార్పొరేట్‌కు అప్పగించే కుట్రలో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని మున్సిపాలిటీ పరిధి కట్టుపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులంతా చంద్రబాబు ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. పేదలకు వైద్యం అందాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే, వాటిని తన బినామీల హస్తాల్లోకి చంద్రబాబు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ప్లకార్డులు చూపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనంద్, పైడినాయుడు, నాగేష్, రాము, కేటీపీ బుజ్జి, జగన్నాథం, శివ, శేషు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: పచ్చని వ్యవసాయ భూముల్లో విషపూరిత రసాయనాలు వెదజల్లే బల్క్‌డ్రగ్ పార్కు పెట్టకుండా పాలకులకు బుద్ధి చెప్పాలని సీపీఎం నాయకులు పెదగుమ్ములూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో ఏర్పాటు చేసే బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు 38 రోజులుగా నిరసనలు చేపడుతున్నా పాలకులు కరుణించలేదని వాపోయారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేష్, స్థానిక యువకులు భాస్కర్, కొర్ర ప్రసాద్, ఏనుగుపల్లి రాములు, తరిపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతం లేని పార్టీ జనసేన

- వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచిన వారికి జనసేన కండువాలు వేసి సంబరాలా?
- డబ్బు, మదంతో విర్రవీగిన నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు
- కూటమి నాయకులపై దుమ్మెత్తి పోసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన ఎంపీటీసీలకు డబ్బు, అధికారం చూపి జనసేన కండువాలు వేసి వెన్నుపోటు పొడిచారని, భవిష్యత్తులో వారికి ప్రజలు బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల నాయకులు తెలిపారు. యలమంచిలి వైఎస్సార్‌సీపీ ఎంపీపీ బోదెపు గోవింద్‌పై కూటమి నాయకులు అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో ఆదివారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సీనియర్లు నియోజకవర్గంలో కూటమి నాయకుల అనైతిక, అప్రజాస్వామిక కార్యకలాపాలపై ముక్తకంఠంతో దుమ్మెత్తిపోశారు. వైఎస్సార్‌సీపీ నలుగురు ఎంపీటీసీలతో అవిశ్వాసానికి తెగబడిన జనసేన, బీజేపీ, టీడీపీ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన పార్టీకి ఒక సిద్ధాంతం అంటూ లేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ గుర్తుతో గెలిచిన సభ్యులు పార్టీ ఫిరాయించి అవిశ్వాసం పట్టి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నో ఒత్తిడులు వచ్చినా, తన తండ్రి జనసేనలోకి మారినా, తాను మాత్రం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగానని పీఎస్‌ఆర్‌పేట ఎంపీటీసీ ఊటకూటి రాజీవ్ అన్నారు. ఎన్ని వేధింపులకు గురిచేసినా రాజీవ్ బెదరకుండా పార్టీకి నిబద్ధతతో ఉండడంపై నాయకులంతా అభినందించారు.



మాట్లాడుతున్న బోదెపు గోవింద్

పదవి పోయినందుకు బాధలేదు : గోవింద్

తనపై అనైతికంగా అవిశ్వాసం పెట్టి దొడ్డిదారిలో గద్దెనెక్కడం కూటమి నాయకులు చేసిన అప్రజాస్వామిక చర్యల్ని ప్రజలంతా ఛీకొడుతున్నారని మాజీ ఎంపీపీ బోదెపు గోవింద్ తెలిపారు. పదవి పోయినందుకు తనకు కొంచెం కూడా బాధలేదన్నారు. 2009 నుంచి వైఎస్సార్‌సీపీలోనే తాను కొనసాగుతున్నానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ అధినేత వైఎస్ జగన్ తనకు ఎంపీపీ కంటే ఉత్తమమైన పార్టీ పదవి ఇచ్చారన్నారు. పార్టీ నాయకులంతా ఐకమత్యంతో పనిచేస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తనను పదవి నుంచి దించడానికి ఒక బీజేపీ నేత లక్షలు ఖర్చు పెట్టారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహంతో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన వారితో అడ్డదారి రాజకీయాలు చేశారన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి రాజకీయాలు ఎప్పుడూ చూడలేదన్నారు. యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, యలమంచిలి పట్టణం, మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఎంపీటీసీ ఊటకూటి రాజీవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, కొఠారు కొండబాబు, దాసరి కుమార్, పిల్లా త్రినాథరావు, రాపేటి సంతోష్, పిట్టా సత్తిబాబు, కాళ్ల సీతారాం, గొర్లి వెంకట్, దూది నర్సింహమూర్తి, పాలరౌతు స్వామి, సిద్ధా నూకేశ్వరరావు, రాధామోహన్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

- నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ



కోటి సంతకాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధర్మశ్రీ, బొడ్డేడ తదితరులు

మునగపాక: వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. వాడ్రాపల్లిలో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రచ్చబండలో భాగంగా సమావేశం నిర్వహించారు. కోటి సంతకాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడేలా పాటుపడాలన్నారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కన్నుంనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, నాయకులు దాసరి అప్పారావు, కాండ్రేగుల జగన్, మొల్లేటి శంకర్, బొద్దపు శ్రీరామమూర్తి, రామ జోగినాయుడు, సత్యనారాయణ, బుజ్జి, లీలా భాస్కరరావు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో డ్రైనేజీల నిర్మాణం



పి.కె.పల్లిలో నిర్మిస్తున్న డ్రైనేజీ

కోటవురట్ల: పి.కె.పల్లిలో జెడ్పీ నిధులతో డ్రైనేజీల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. వీధుల్లో డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై పారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడేవారు. దాంతో వైఎస్సార్ సీపీ నాయకులు జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె రూ.5 లక్షలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే ఈ సమస్య పరిష్కారానికి నోచుకుంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం'



కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం కుతంత్రాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. శనివారం రాత్రి మండలంలోని నాగవరంలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయగా, వాటిలో ఏడు నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటుపరం చేసేందుకు కుతంత్రాలకు పాల్పడడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేయాల్సి వస్తుందన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి కాండ్రేగుల జగన్, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, గనిశెట్టి వెంకట్, గెంజి రమణ, అప్పికొండ శ్రీనివాసరావు, అప్పికొండ సంతోష్, కాంతమ్మ, సన్యాశిరావు పాల్గొన్నారు.

నవంబర్ 3న శూలాల మహోత్సవం



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

మునగపాక: వచ్చేనెల 3న మునగపాకలో శూలాల మహోత్సవం నిర్వహించనున్నట్టు సాంబశివ ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. స్థానికులు పలు సూచనలు, సలహాలు అందించారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పెద్దలు టెక్కలి పరశురామ్, దాడి శ్రీరామమూర్తి, కుంది సూర్యనారాయణ, దాడి శివ, డొక్కా నాగభూషణం, మారిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

అయ్యప్పల భిక్ష

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్పభక్తుల భిక్ష కార్యక్రమం ఆదివారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. ఈ నెల 13వ తేదీన అయ్యప్ప భక్తుల కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు దాతలు ఈ భిక్షకు సహకారం అందిస్తున్నారు.

పంచరాత్ర ఉత్సవాలకు వేళాయే ...

నేటి నుంచి నాగుల చవితి వరకు వేడుక



తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు

యలమంచిలి రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్ర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఉత్సవాలను ఈ సారి మరింత ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు ఐదు రాత్రులు యలమంచిలిలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల కోసం పట్టణంలోని తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కమిటీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీపావళి రోజు ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు నాగులచవితి వరకు ఐదు రాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. కనులు మిరుమిట్లు గొలిపేలా విద్యుద్దీపాలతో భారీ సెట్టింగులు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ప్రధాన రహదారి నుంచి తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారి ఆలయం వరకు అంతర్గత రహదారులన్నీ కనులు మిరుమిట్లు గొలిపేలా విద్యుద్దీపాలతో కాంతులీనుతున్నాయి. ఎగ్జిబిషన్లు, వివిధ దేవతామూర్తుల ఆకారాల సెట్టింగులను సందర్శకుల కోసం రెడీ చేశారు. సోమవారం ఉత్సవాలను రెండు కమిటీలు లాంఛనంగా ప్రారంభించనున్నాయి. దీపావళి నుంచి నాగులచవితి వరకు జరగనున్న పంచరాత్ర మహోత్సవాలను చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. నాగులచవితి రోజున జరిగే జాతర మరింత ప్రత్యేక ఆకర్షణగా ఉండనుంది. ఆ ఒక్కరోజే సుమారు లక్ష నుంచి లక్షన్నర వరకు భక్తులు తరలివస్తారని అంచనా. రోజూ నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలు మరింత ఆకట్టుకోనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని భూలోకమాంబ అమ్మవారు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు

మహా రాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

EP 9/2025 OS 18/2017

Between:

టిమిశెట్టి వాగేశ్వరరావు (Died) వగైరాలు ....పిటీషనర్లు/DHR

And :

పెన్మెంరాజు వెంకట రామరాజు ...JDR

వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ అమలులో JDR కు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారు కోర్టు వారి ఎదుట తేది: 06-11-2025 ఉదయం 10.30 గం॥ నుండి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని శ్రీ కోర్టు వారిచే వేలం షరతులకు లోబడి వేలం వేయబడును. కావున వేలంలో పాల్గొనదలచినవారు తేది: 06-11-2025న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడం అయినది.

వేలం షెడ్యూలు వివరములు

విశాఖపట్నం జిల్లా, యలమంచిలి సబ్ డి॥, అచ్యుతాపురం మండలం, H/O దోసపల్లి గ్రామం, మోసయ్యపేట గ్రామం Dry Land, S.No. 205/6లో 272 చ॥గజములు భూమి తాలూకు హద్దులు: **East:** 71 Feet : House Belongs to Kalidindi Sarada Devi, **South:** 37 Feet : Road, **West:** 71 Feet : 3 Feet width way belongs to Kanumuri Hymavathi, **North:** 32 Feet : Site Belongs to Kanumuri Hymavathi.

DHR విలువ : Rs. 5,00,000/-

అమీనా విలువ : Rs. 20,00,000/-

యలమంచిలి
తేది: 15-10-2025

S. అప్పలనాయుడు
D.Hr తరపు అడ్వకేటు

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో

మహా రాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 18/2024 O.S. 930/2017

VI వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, విశాఖపట్నం

Between:

పీలా రామకృష్ణారావు ..... DHR

And:

కంఠంరెడ్డి సత్యవతి ..... JDR

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో JDr కు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారు కోర్టులో తేది: 06-11-2025 ఉదయం 10.30 గం॥ నుండి ఈ క్రింది షెడ్యూలు ఆస్తులను శ్రీ కోర్టువారు వేలం షరతులకు లోబడి వేలం వేయుదురు. కావున వేలంలో పాల్గొనదలచినవారు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలంలో పాల్గొనవలసినదిగా ఇందుమూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడం అయినది.

వేలం షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, యలమంచిలి సబ్ డి॥, అచ్యుతాపురం మండలం, సోమవారం గ్రామం [illegible] విస్తీర్ణం య. 1.41 ల భూమి వివరాలు:

Item 1: సర్వే నెంబరు 12/1B నందు య. 0.15 సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** [illegible] భూమి, **పడమర:** [illegible] భూమి, **దక్షిణం:** [illegible] భూమి, **ఉత్తరం:** [illegible] భూమి.

Item 2: సర్వే నెంబరు 19 నందు య. 0.31 సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** కంఠంరెడ్డి [illegible] భూమి, **పడమర:** కంఠంరెడ్డి [illegible] భూమి, **దక్షిణం:** ప్రభుత్వ భూమి, **ఉత్తరం:** M.P. [illegible] భూమి.

Item 3: సర్వే నెంబరు 31 నందు య. 0.45 సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** [illegible] భూమి, **పడమర:** కంఠంరెడ్డి [illegible] భూమి, **దక్షిణం:** [illegible] భూమి, **ఉత్తరం:** కంఠంరెడ్డి [illegible] భూమి.

Item 4: సర్వే నెంబరు 99/1 నందు య. 0.50 సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** [illegible] భూమి, **పడమర:** [illegible] భూమి, **దక్షిణం:** [illegible] భూమి, **ఉత్తరం:** [illegible] భూమి.

DHR విలువ: Rs. 20,00,000/-

Amin విలువ: Rs. 14,10,000/-

A.N. Murali Krishna
Srinivasa Patnaik
Advocates
Yelamanchili

యలమంచిలి
తేది: 15-10-2025